వ్యాస రచన పోటీల్లో ప్రతిభ

బహుమతులు అందజేస్తున్న చిన జీయర్ స్వామి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 22 : ప్రజ్ఞా వికాస్ సంస్థ నిర్వహించిన ఇంగ్లిష్ వ్యాస రచన పోటీల్లో జిల్లా కేంద్రంలోని సెయింట్ జోయల్స్ పాఠశాల 9తరగతి విద్యార్థి ప్రజ్ఞా కుమార్ జిల్లా స్థాయి రెండో స్థానంలో నిలిచాడు. కాగా, విద్యార్థికి చిన జీయర్ స్వామి బహుమతి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవభూషణం అభినందించారు

జిల్లా ప్రధానకార్యదర్శిగా సాహితి

సాహితి(ఫైల్)

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 22 : ఆర్యవైశ్య మహాసభల జిల్లా ప్రధానకార్యదర్శిగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన నరేందుల సాహితిని నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితి గతంలో వాసవీక్లబ్‌తో పాటు, ఆర్యవైశ్య సంఘంలో వివిధ పదవులు పొందారు. ఆ సమయంలో తను చేసిన సేవా కార్యక్రమాలు, సామాజిక సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. సాహితికి పదవి రావడంతో తన స్నేహితురాళ్లతో పాటు, ఆర్యవైశ్య సంఘాల సభ్యులు, పట్టణ వ్యాపారులు, ఆర్యవైశ్య మహిళలు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మంచిర్యాల మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 33 : మంచిర్యాల మార్కెట్ ఏరియాను ఎమ్మెల్యే ప్రేం సాగర్ రావు శనివారం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పర్యటించారు. మార్కెట్లో వెలసిన అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కాంప్లెక్స్‌ల కింద ఉన్న సెల్లార్లను పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇటీవల వెలసిన కూరగాయల మార్కెట్‌లో టేలాలను తొగించాలన్నారు. పాత వాటర్ ట్యాంక్ కూల్చివేసిన తర్వాత అక్కడ షెడ్లను వేసుకోవాలని సూచించారు. కూరగాయల మార్కెట్‌లో తోపుడు బండ్లను కోటక్ మాహింద్రా బ్యాంక్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అజయ్ ఎంటర్‌ప్రైజెస్ కాంప్లెక్స్ ముందు అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన పొడిగింపు షెట్టర్లను తొలగించాలని, బుధవారం నుంచి పనులను ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధి సందర్శీకరణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి, ఏసీపీ ప్రకాశ్, సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాలు

- 'మాములు'గా తీసుకుంటున్న మున్సిపల్ అధికారులు
- భారీగా మున్సిపల్ ఆదాయానికి గండి
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..

బెల్లంపల్లి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాల వ్యవస్థ జోరుగా సాగుతున్నది. ఇక్కడ జీప్లస్ 2కు మాత్రమే అనుమతులు ఉండగా, పలువురు యథేచ్ఛగా భవనాలు నిర్మించడం విమర్శలకు తావిస్తున్నది. సీడీఎంఏ కార్యాలయ పర్మిషన్ తీసుకోకపోవడంతో బస్తీ, పట్టణ నాయకులను ప్రసన్నం చేసుకుంటే చాలు.. నిబంధనలు తుంగలో తొక్కి ఎన్ని అంతస్తుల భవనాలనైనా నిర్మించుకోవచ్చనే ప్రచారమూ ప్రజల్లో వినిపిస్తున్నది. అధికారులు 'మామూలు'గా తీసుకోవడంతో కట్టడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతున్నది. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తుండడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతున్నది. - బెల్లంపల్లి, సెప్టెంబర్ 22

సీడీఎంఏ అనుమతి తీసుకోవాలి..

బెల్లంపల్లి మున్సిపాలిటీలో జీప్లస్ 2 భవనాలకు మాత్రమే అనుమతులున్నాయి. అంతకు మించి అంతస్తులకు సీడీఎంఏ అనుమతులు తప్పనిసరి అని మున్సిపల్ నిబంధనలు గట్టిగా చెబుతున్నాయి. బెల్లంపల్లిలో మాత్రం నాలుగు, ఐదు అంతస్తుల వరకు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. సీడీఎంఏ అనుమతి తీసుకున్న తర్వాతనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, ఆ నిబంధనలను మచ్చుకు కూడా ఇక్కడ పాటించడం లేదు. ముందస్తు ఏర్పరుచుకున్న ఒప్పందం ప్రకారం మున్సిపల్ అధికారులు అటువైపు వెళ్లడానికి ఇష్టపడడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకుందామని కాకుండా తాము లాభపడాలనే ఉద్దేశంతో పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు పెట్రేగిపోతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక కొంత మంది నాయకుల అండదండలతో ఇలాంటి నిర్మాణాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతున్నదని అంటున్నారు. మున్సిపాలిటీకి ఆదాయ వనరులు సమకూర్చుకొని, పట్టణాభివృద్ధికి పాటుపడాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో యథేచ్ఛగా బహుళ అంతస్తుల కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

గాలికొదిలేసిన కలెక్టర్ ఆదేశాలు..

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఇటీవల విస్తృతంగా బెల్లంపల్లిలో పర్యటించిన సమయంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాల విషయం ఆయన దృష్టికి వచ్చింది. దీంతో మున్సిపల్ అధికారులకు సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. సీడీఎంఏ అనుమతి లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న యజమానులకు వెంటనే నోటీసులు అందించి, సంబంధిత జరిమానా విధించాలని ఆదేశించారు. అయినా మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలకు ఉపక్రమించకపోవడం వారి అమ్యామ్యాలకు అద్దం పుడుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. జరిమానాలు విధించి మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకోవాలని చెప్పినా కలెక్టర్ మాటలు పెడచెవిన పెట్టడంతో సంబంధిత యజమానులు మరింత రెచ్చిపోయి బహుళ అంతస్తుల భవనాలు పోటాపోటీగా నిర్మిస్తున్నారని అంటున్నారు. నిరుపేద తనకున్న చిన్నపాటి స్థలంలో ఇంటి నిర్మాణం చేపడితే మున్సిపల్ అధికారులు మందీమార్బలంతో వాటిని అడ్డుకుంటున్నారని పేర్కొంటున్నారు. బజార్ ఏరియా నడి బొడ్డున, పోస్టాఫీస్ లైన్, డబ్బుసేట్ లైన్‌తో పాటు, ఇతర ఏరియాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బజార్ ఏరియాలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనం

❖ బహుళ అంతస్తులకు అనుమతులు లేవు..

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమవుతున్న బహుళ అంతస్తులకు ఎలాంటి సీడీఎంఏ అనుమతులూ లేవు. బెల్లంపల్లి పట్టణంలో జీ ప్లస్ 2 భవనాలకు మాత్రమే స్థానికంగా మున్సిపాలిటీ నుంచి అనుమతి పొంది నిర్మాణాలు చేసుకోవచ్చు. సీడీఎంఏ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతనే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టాలి. పట్టణంలో నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలను లిస్ట్ అవుట్ చేస్తున్నాం. అన్నింటికీ ఒకేసారి జరిమానా విధిస్తాం. - శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

చెన్నూర్‌లో విద్యుత్ అంతరాయం

- రాత్రి 8 నుంచి 2:30 గంటలకు నిలిపివేత
- ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా చేసిన సిబ్బంది

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 22 : చెన్నూర్ పట్టణంలో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రాత్రి 8 గంటలకు పోయిన కరెంట్.. అర్ధరాత్రి తరువాత 2:30 గంటలకు వచ్చింది. దీంతో చెన్నూర్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు అంతరాయంపై సమాచారం ఇవ్వకపోవడంతో సోషల్ మీడియాలో కరెంట్ ఎప్పుడు వస్తుందని యువకులు చర్చలు జరిపారు. వర్షం కారణంగా పిడుగుపాటుకు కిష్టంపేట 133 కేవీ సబ్ స్టేషన్‌లో చెన్నూర్ ఫీడర్ చెడిపోయిందని ఏడీఈ రవికుమార్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో సిబ్బందితో సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టారు. రాత్రి 2:30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అనంతరం కోటపల్లి, వేమనపల్లి 33 కేవీ లైన్ సమస్యల వల్ల రెండు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. సిబ్బందితో మరమ్మతులు చేపట్టి, ఉదయం 3 గంటలకు విద్యుత్ సరఫరా చేసినట్లు తెలిపారు. వర్షాల కారణంగా ఉరుములు, మెరుపులతో విద్యుత్ సరఫరాలో చిన్న చిన్న సమస్యలు వస్తున్నాయని, వాటిని సిబ్బందితో పరిష్కరించడం జరుగుతుందని, వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. తెలిపారు. ఏఈ శ్రీనివాస్, లైన్ మెన్ సతీశ్ సిబ్బంది ఉన్నారు.

మల్చింగ్ విధానంపై అవగాహన

దహెగాం, సెప్టెంబర్ 22 : మిరప పంట సాగులో మల్చింగ్ విధానంపై మండల కేంద్రంలో ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల పొలాస జగిత్యాలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని రఘోత్తంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు పలు విషయాలు వివరించారు. మిర్చిపంటలో మల్చింగ్ విధానంతో నేలలో తేమ, నీటిని రక్షించుకోవచ్చన్నారు. కలుపు మొక్కలు రాకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పీ నరేశ్, ఎం వినోద్, కే ఉదయ్, కే మేమంత్, వీ మధు, ఏ శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

అత్తను హతమార్చిన అల్లుడి ఆత్మహత్య

- బెయిల్‌పై బయటకు వచ్చి అఘాయిత్యం..

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 22 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో అత్తను హతమార్చి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అరెస్టయిన శాతం అల్లుడు వెంకటేశ్ ఆదివారం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన తెలిపిన కుటుంబ కలహాలతో మధ్యానికి బానిసైన వెంకటేశ్ మద్యం మత్తులో గత జూలై 13న తన అత్త నెల్లి విజయను తన భార్య మాళవిక ముందే విక్షణారహితంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం తాను కూడా అదే కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేశ్‌పై పోలీసులు హత్య కేసు నమోదు చేసి, స్థానికంగా ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్సను అందించారు. కోలుకున్న తర్వాత జగిత్యాలలోని తన బంధువుల ఇంటికి పారిపోయేందుకు పోలీసుల కన్నుగప్పి ప్రయత్నించగా, స్థానిక బస్టాండ్‌లో అదుపులోకి తీసుకొని గత నెల 2న రిమాండ్‌కు తరలించారు. ఈ మధ్య కాలంలో బెయిల్‌పై వచ్చిన వెంకటేశ్, మనస్థాపం చెంది గోదావరిఖని సమీపంలో గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా, వెంకటేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

వేమనపల్లి, సెప్టెంబర్ 22 : వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన ఆకుల అంకు (40) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. మానసిక స్థితి సరిగా లేక ఆకుల అంకు నాలుగు రోజుల నుంచి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నది. గతంలో చనిపోయిన తన తల్లిని గుర్తు చేసుకుంటూ ఈ నెల 20న మధ్యాహ్నం ఉరేసుకోగా, ఆమె తమ్ముడు అశోక్ కాపాడాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించవద్దు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 22 : తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించవద్దని మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షుడు రేణిగుంట్ల శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాష మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేసి, ఆత్మబలిదానం చేసుకున్న మహనీయుడు పొట్టి శ్రీరాములు అని గుర్తు చేశారు. ఆయన పేరు తొలగింపు ప్రక్రియ సమంజసంకాదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు అందించిన సేవలకు గాను నూతన ప్రాజెక్ట్‌కు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టి గౌరవించుకోవాలని కోరారు.

బాధితురాలికి పరామర్శ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, సెప్టెంబర్ 22 : లైంగిక దాడికి గురై హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న మహిళను ఆదివారం సీపీఎం పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ మహిళ కొడుకు, వైద్యులను ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కుశన్న రాజన్న మాట్లాడుతూ.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు, అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గం దినకర్, గొడిసెల కార్తీక్, ముంజం ఆనంద్ తదిరులు ఉన్నారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మందమర్రి, సెప్టెంబర్ 22 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి రవీంద్రఖని రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలూ లేవని, అతనికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో భద్రపర్చినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 83285 12176 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వాహనాల తనిఖీ

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వేమనపల్లి, సెప్టెంబర్ 22 : వేమనపల్లి మండలంలోని పోలీసులు ఆదివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్యామ్ పటేల్ వాహనాలను తనిఖీ చేయడంతోపాటు, వాహనదారుల వివరాలు తెలుసుకున్నారు. మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాల సందర్భంగా అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పోలీసులు పాల్గొన్నారు.

పల్లెనిద్ర..

కొత్తగూడెం గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ప్రజలు కలిసి మెలిసి ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎస్ఐ శ్యామ్ పటేల్ సూచించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331774-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

సిర్పూర్: 91827 77671, 91827 77677

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 : కాగజ్‌నగర్ పట్టణంలోని అశోక్ కాలనీకి చెందిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు నగేశ్.. గణేశ్ నిమజ్జనంలో జరిగిన క్రేన్ ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆదివారం రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికులంతా కార్యాలయం ఎదుట ధర్నా చేసిన తరుణంలో ఎమ్మెల్యే తన తరుపున సాయం చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో ఇన్సూరెన్స్ ఇప్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, అరుణ్ లోయా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రక్త శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 22 : ఆదిలాబాద్ జిల్లాలోని తలసేమియా, సికిల్‌సెల్ బాధితుల కోసం ఆదిలాబాద్ రిమ్స్ వైద్య కళాశాల, దవాఖానలో రక్త శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కోరారు. ఈ మేరకు ఆదిలాబాద్ ఎంపీ జీ నగేశ్‌కు ఆదివారం వినతి ప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రక్తం వైద్యం అందించే ఏర్పాటు చేయాలని, తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫిలియా రోగుల సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితుల తల్లితండ్రులు, ఇన్సోసైట్స్ హెల్త్‌కేర్ అసోసియేట్ వైద్యులు శ్యాంసుందర్, ఓంకార్నాథ్, శ్రీధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

దండేపల్లి, సెప్టెంబర్ 22 : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలగించిన ఎస్సీ వార్డు సభ్యుల రిజర్వేషన్ పునఃప్రారంభించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక సభ్యులు ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీ ఎస్సీలకు ప్రత్యేకమైన కార్పొరేషన్ ప్రకటించి, ప్రత్యేక నిధులు కేటాయించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిపర్చాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న నామినేటెడ్ పదవులను ప్రత్యేకంగా ఏజెన్సీలో నివసిస్తున్న వారికి కేటాయించి రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నాను, రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, గోళ్ల రాజమల్లు, నారాయణ్ నాయక్, శశికుమార్, అనిల్ తదితరులున్నారు.

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 22 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సమీప గోదావరిలో చైర్మన్ సుర్మిల్ల వేణు, కమిషనర్ సతీశ్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గోదావరి ఒడ్డున చెత్తా చెదారాన్ని మున్సిపల్ సిబ్బందితో కలిసి శ్రమదానం చేసి తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరి ఒడ్డున ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించామన్నారు. ఘాట్ రోడ్డు, నది ఒడ్డు ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఈఈ జీ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి, సెప్టెంబర్ 22 : రామకృష్ణాపూర్ పట్టణంలోని సూపర్‌బజార్ నుంచి బీజోన్ రాజీవ్ చౌక్ వరకు క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. నివాస పరిసరాలు, ఖాళీ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, ప్రదీప్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 22 : పట్టణంలోని సర్దార్ బస్తీలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. స్వచ్ఛత, పరిశుభ్రతపై కాలనీ ప్రజలకు ఆర్పీఎఫ్ సీఐ శంకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ప్రాచీదేవి, ఏఎస్ఐ ఆర్ దాసు, ఆర్పీఎఫ్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్ : సీతారాంపల్లి గోదావరిలో శ్రమధానం చేస్తున్న కమిషనర్, సిబ్బంది

రామకృష్ణాపూర్ : ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, ఆర్పీలు, విద్యార్థులు

కాగజ్‌నగర్ : స్వచ్ఛ తా హీ సేవ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

ఘరానా సైబర్ మోసం

- వ్యాపారవేత్తకు రూ.కోటి 43 లక్షల75 వేల టోపీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

రామగుండం పోలీసుల అదుపులో ముఠాసభ్యుడు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: మంచిర్యాలలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది. ఓ వ్యాపారవేత్తకు ఫోన్ చేసి బెదిరించి ఫోన్‌రూ.కోటి 43లక్షల75వేలు లూటీ చేసిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఆదివారం రామగుండం సైబర్‌క్రైమ్ పోలీస్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కృష్ణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త గత జూలై 22న గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'హలో నేను ముంబాయి పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్న. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈ కేసు నుంచి బయటపడాలంటే చెప్పిన మేం చెప్పిన అకౌంట్ నంబర్‌కు డబ్బును త్వరగా పంపించాలి. మీ డబ్బును చెక్ చేసిన తర్వాత తిరిగి మీ అకౌంట్‌కు పంపిస్తాం. లేదంటే జైలుకు వెళ్లక తప్పదు' అంటూ బెదిరించడంతో బాధితుడు వణికిపోయాడు. అతని మాటలు నమ్మి భయంతో రూ.కోటి 43లక్షల 75వేలు పలు దపాలుగా ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయితే డబ్బులు తిరిగి తన అకౌంట్‌కు రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయగా డీజీపీ, రామగుండం సీపీ ఆదేశాల మేరకు రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడు మనీ ట్రాన్స్‌ఫర్ చేసిన బ్యాంక్ అకౌంట్ మహారాష్ట్రలోని వాసిం జిల్లాలోని సంతోశ్ శ్రీకృష్ణ నాగల్కర్‌దిగా గుర్తించారు. మహారాష్ట్రకు వెళ్లి, ముఠా సభ్యుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌కు వచ్చిన మనీ మరో అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ జరిగినట్లు గుర్తించారు. అతన్ని విచారించగా, డబ్బులు వచ్చిన మాట నిజమేనని, వాటిపై తాను కమీషన్ మాత్రమే తీసుకుంటానని అంగీకరించడంతో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, అసలు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా, ఈ నిందితుడి అకౌంట్ ద్వారా ఇప్పటివరకు 18 సైబర్ నేరాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

24న హిందూ ఉత్సవ సమితి సమావేశం

మందమర్రి, సెప్టెంబర్ 22 : మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ ఏరియాలో గల శివకేశవ ఆలయంలో ఈ నెల 24న హిందూ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సమితి నాయకులు తెలిపారు. ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సనాతన ధర్మం, హిందూ బంధువుల ఆరాధ్య దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని ఉపయోగించి, అపవిత్రం చేసిన ఉదంతంపై నిరస